
# సినీ బేతాళ కథలు





– డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 13 -

### 'క్లాస్' కలకళ

**విక్రమార్కుడు** మళ్ళీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'విక్రమార్కా! నీకు శ్రమ కలగకుండా ఉండేందుకు మరో కథ చెబుతాను విను.' అని బేతాళుడు ప్రారంభించాడు.

– తిమ్మరుసుగారని ఒక ప్రముఖ తెలుగు నిర్మాతగారున్నారు. ఆయనకోసారి రోజూ వచ్చే రొటీన్ తెలుగు సినిమా కాకుండా ఎవరేనా ఒక ప్రముఖ వ్యక్తి జీవిత కథను 'క్లాస్'లేకుండా క్లాస్ చిత్రంగా తీసి తెలుగు ప్రేక్షకులకు సమర్పించాలనుకున్నారు. ఇక్కడ 'క్లాస్' అనగానేమి? అనే విషయం మీద నీకో క్లాస్ పీకుతాను. ఫలానా సినిమా యెలా ఉంది సార్? అని బాపుగారిని యెవరేనా అడిగితే, బదులుగా ఆయన 'ఫర్లేదు – సరదాగా బాగానే ఉందండి. కాకపోతే యింటర్వెల్ తర్వాత కొంచెం క్లాస్ ఉందండి. అది భరిస్తే ఓకే.' అనేవారు. క్లాస్ అనగా గొంతుకలో పచ్చి వెలక్కాయవంటిది. అవార్డు సీన్లతో నిండి అపారమైన తలనొప్పి కలిగించి, యెలావుందని అడిగినవారికి బోర్ అని చెప్పలేక, అద్భుతం అనే మాటను మనస్సాక్షికి యెదురు తిరిగి పలికించి ప్రేక్షకుడిని కుమ్మేసేదే క్లాస్ చిత్రం.

అంచేత తిమ్మరుసుగారు రొటీన్‌క్లాస్ కాకుండా ప్రేక్షకుడు మనసారా క్లాస్ అండ్ భేష్ అనుకునే చిత్రం తియ్యాలనుకున్నారు.

తిమ్మరుసుగారు బాగా చదువుకున్నమనిషి. జీవిత చిత్రం తీస్తే సర్ రిచర్డ్ ఎటెన్‌బరో 'గాంధీ' చిత్రం స్థాయిలో తియ్యాలని ఆయన సంకల్పం. కొౌతారిగారు, ఎటెన్‌బరోకి గాంధీ జీవితం మీరు చదివి తీరాలి అని పుస్తకం ఇస్తే చాలా రోజులదాకా ఆయనకి చదవడం కుదరలేదు. ఓరోజు పేజీలు తిరగేస్తుంటే వొకటో రెండో వాక్యాలు, ఎటెన్‌బరో మనసుకి హత్తుకున్నాయి. – సాటిమనిషిని తనకంటే తక్కువగా నీచంగా చూడడం, వాడడం తమ గౌరవాన్ని పెంచుతుంది అని ఎందుకనుకుంటారో నాకర్థంకాదు – అన్న గాంధీగారి మాటలు చదివి కదిలిపోయిన ఎటెన్‌బరో గాంధీ ఇంతగొప్ప మనిషా అని విస్తుపోయి, యేమైనా సరే ఈ మహనీయుడు కథ సినిమా తీసి తీరాల్సిందే అని అహోరాత్రాలు అవస్థలు పడి, అధిగమించి, యేళ్ళ తరబడి శ్రమించి గాంధీ చిత్రం తీసి అంతర్జాతీయంగా అపూర్వ విజయం సాధించాడు.

తీస్తే ఆ స్థాయిలో తియ్యాలి అనుకున్నారు తిమ్మరుసుగారు. అయితే యెందరో మహానుభావులు అందరివీ వందల చిత్ర కథలు.

తను చదివిన అనేక గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలన్నీ తిరగేశాడు. చివరికి వొక మహోన్నత వ్యక్తి జీవితాన్ని చిత్రంగా తీయాలని నిర్ధారించుకున్నాడు. అయితే హీరోగా యెవర్ని పెట్టుకోవాలి? పాత్రలో జీవించగలిగిన నటుడెవరు? తిమ్మరుసుగారు బాగా వెదికారు. అన్ని భాషల నటులు బాగా బిజీగా ఉన్నారు. ఎంతోమందిని కలిశాడు. కొంత మంది పాట్స్ (పాటలు), ఫైట్స్ లేకపోతే చెయ్యమన్నారు. కొంతమంది యిద్దరు ముగ్గురు హీరోయిన్లు లేకపోతే కుదరదు అన్నారు. యింకొంత మంది చివరిదాకా వొకే మేకప్‌లో వుంటాం, కావాలంటే డ్రెస్సులు మార్చుకోండి అన్నారు. తిమ్మరుసుగారు విసుగు చెందని విక్రమార్కుడిలా అంటే నీలా బాగా వోపిగ్గా తిరిగారు. చివరికి యుకెలో డేనియల్ డే లూయిస్ వోకే అన్నాడు. డేనీ డే లూయిస్ తక్కువ చిత్రాల్ని చేసినా పాత్రలో జీవించి చేస్తాడు. ఆస్కార్ అవార్డు పువ్వుల్ని అవలీలగా అందరికంటే యెక్కువగా తురుముకున్నవాడు.

తిమ్మరుసుగారి సాత్త్విక భావానికి పులకించిపోయాడు డేనీ. 'యూ సీ - టీమారస్! ఐమీన్ తిమ్మరుస్! - నేను మీ పిక్చర్‌కి వొప్పుకోగానే స్క్రిప్టు చదివి, షూటింగ్‌కి ముందే పాత్రలో ఎంటరైపోతాను. కంగారు పడకండి' అని తెలుగు నేర్చుకుంటూ యింగ్లీషులో హామీ యిచ్చాడు.

తిమ్మరుసుగారు థ్రిల్లయిపోయారు.

షూటింగ్‌కి ముందు వొక వీధిలో, లొకేషన్‌లో ఫిల్మ్ క్రూ అంతా వొక యింట్లో కూర్చుని తియ్యబోయే సీనొకటి రిహార్స్ చేద్దామనుకున్నారు. సదుపాయం కోసం ఆ యిల్లు డానీ డే లూయిస్ వుండే వీధిలోనే ఉంది. నైబరింగ్ హౌస్‌లో ఉన్న డానీ కూడా జోయినయ్యాడు.

ముందుగా అంతా పార్టీ ప్రారంభించారు. చుక్కలు కనిపించేదాకా చుక్కలు వాడారందరూ.

దర్శకుడు - 'ఏవండీ! డైరెక్టరుగారూతో మొదలై 'ఏరా - డరివికటర్ నా కొడకా!' దాకా సాగింది.

కెమేరామన్ - 'తిమ్మరుసుగారూ! యింతకీ మన బొమ్మ టైటిలేవిటిసార్?' తో మొదలై, 'నువ్ తిమారుస్ కాదురా తిక్కారుస్. రెండు బాటిల్స్ ఎంప్టీ అయి ఏడు స్ తున్నాయ్ - టైటిల్ సెప్పరా అని ఎన్నిసార్లు అడగ్గాలిరా - నేనే కిషన్‌దేవరాయలైతే నీకళ్లు రెండూ పీకేసి కల్లు తాగేసావోన్ని!' - దాకా సాగింది.

'చాలా లేటయింది. అంతా యింక కదలండి' అన్నారు తిమ్మరుసుగారు.

'అవును.. అంతా ఎక్సిటిచ్చుకోండి' అన్నాడు డానీ.

ఆ రాత్రి పార్టీ ముగిసింది. షూటింగ్ కోసం తీసుకున్న అదే యింట్లో తిమ్మరుసుగారు బసచేస్తున్నారు.

'డానీగారు. మరి రేపు కలుద్దాం' అన్నారు తిమ్మరుసు.

'ఓకే. వియ్ విల్ మీట్ టుమారో' - అన్నాడు గానీ డానీ కదలడంలేదు.

'మరి - గుడ్‌నైట్' అన్నాడు తిమ్మరుసు.

'గుడ్‌నైట్ - బై' అన్నాడు డానీ - కానీ కదల్లేదు.

హీరోగారికి యెలా చెప్పాలో, తిమ్మరుసుగారికి పాలుపోవడంలేదు. చివరికి ధైర్యం చేసి అన్నారు - 'డానీగారూ - మీ యిల్లు అదుగో ఆ పక్క యిల్లు -'

'మరి చెప్పరేం. యిదే మా యిల్లు అనుకుంటున్నాను. మీరెంతకీ కదల్రేం? అని నేననుకుంటున్నా- ఐ యామ్ సారీ -' అంటూ లేచాడు డానీ డే లూయిస్.

- అదీ విక్రమార్కా! మొదటిరోజునే తన యిల్లు వొళ్ళు మరిచిన డానీ, స్క్రిప్టు అందగానే పాత్రలో జీవిస్తానన్న డానీ, హీరోగా న్యాయం చేకూర్చగలడంటావా? ఇంతకీ తిమ్మరుసుగారు తీసే ఆ చిత్రం పేరేవిటి? అది ఏమహనీయుడి జీవిత కథ?

– ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో, నువ్వు యిక ముందు చూసే సినిమాలన్నీ ‘క్లాస్‘ పూరితాలయి, నీతల వాచి, పగిలి వెయ్యి చెక్కలవుతుంది.” – అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు –

‘ఓ! బేతాళా! డేనీ డే లూయిస్ స్క్రిప్టు అందగానే నిజంగానే పాత్రలో జీవించడం ఆరంభించాడు. తిమ్మరుసుగారు తీసే చిత్రం ప్రపంచ ప్రఖ్యాత శిఖరం ‘ఐన్‌స్టీన్‘ కథ. నిజంగానే ఒకసారి ఐన్‌స్టీన్‌ని ఆయనుండే వీధిలో మరో యింటి ఆసామీ పార్టీకి పిలిస్తే, పార్టీ పూర్తయే టైముకి అది తన యిల్లే అనుకుని యెంతకీ కదల్లేదుట. పైగా వచ్చిన గెస్టులు యెంతకీ కదల్రేం! అని విస్తుపోయాడుట. అంత గొప్ప శాస్త్రవేత్తకు ఆ మాత్రం పరాకు హర్షణీయమైన అలంకారం. ఐన్‌స్టీన్ ప్రముఖ శాస్త్రవేత్తేకాదు. గొప్ప తాత్వికుడు. సాత్వికుడు. ఆయన భగవద్గీత చదివి –

– నేను భగవద్గీత చదివాక, భగవంతుడు యీ సృష్టినంతా యెలా సృష్టించాడోనని విస్మయుడినై, మిగతావన్నీ అనవసరమైన పైపై ఆర్భాటాలనిపించింది –‘ అన్నారు.

‘ప్రవృత్తించ నివృత్తిం చకార్యా కార్యే భయాభయే!

బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధిస్సా పార్థ సాత్వికీ!!–

సాత్విక బుద్ధి పెంపొందించుకో, కర్మబంధాల్ని తొలగించుకో –‘ అన్నారోయ్ గీతాచార్యులు, శ్రీకృష్ణభగవానుడు –” అని రిప్లీకరించగానే రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు ఎగిరి మళ్ళీ చెట్టెక్కేసాడు.

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments